# బిల్లు ప్రహసనం

"శాంతం..."

అది పిలుపు కాదు పొలికేక.

పరుగెడుతున్నట్లే వచ్చింది అక్కడకు, భర్త కోపాల్రావుకి ఎక్కడ కోపం వచ్చిందేమోనని.

"అలా చూస్తూ తగలడ్డవేం? కాసిని మంచి నీళ్లు తగలెయ్" కండువాను టీపాయ్ మీద పడేసి తన శాల్తీని పడక కుర్చీలో వాలుస్తూ అడిగాడు.

మంచినీళ్లు భయం భయంగా అందిస్తున్న ఆమెను చూస్తే అతనితో వైపై ఏళ్లు సంసారం ఎలా చేసిందా అని అనుమానం రాకపోదు చూసేవాళ్లెవరికైనా.

"ఈరోజు పోస్ట్ వచ్చిందా?"

"ఆఁ ఆఁ! వచ్చింది. ఆ బల్లమీద.. అహహ.. కాదు.. ఆ టీపాయ్ మీదే వున్నాయి" అంది తడబడుతూ.

"సరే! నాలుగు అట్లు వేసి నా ముఖాన కొట్టు. కడుపు మండిపోతోంది."

వంటింట్లోకి నడిచింది. అది నడక లాంటి పరుగు అంటే బాగుంటుందేమో!

గ్యాసు వెలిగించింది.

"శాంతం! ఫోను బిల్లు వచ్చినట్లుందే!" ప్రక్క గదిలోంచి ఆయన మాట ప్రక్కన చెవిలో చెప్పినట్లే వినిపిస్తోంది.

పెనం పొయ్యి మీద పెట్టింది.

"వెయ్యి రూపాయలా?"

పొగలు రాసాగాయి.

"మీ అబ్బ సొమ్ము అనుకున్నారా? ఇది బిల్లేనా?" ఆయన మాటలు అరుపులయ్యాయి.

అట్టు వేసి చుట్టూ నూనె వేసింది.

నూనెలో నీళ్లు కలిసినట్లున్నాయి. అవి చిట పటమంటున్నాయి.

"ఇలా అయితే నేను సంసారం చేసినట్లే! నా నెలజీతం అంతా ఈ ఫోను బిల్లు కట్టడానికి సరిపోయేట్లుంది. ఇది ఎవరి నిర్వాకం? నీదా? నీ సుపుత్రుడిదా?"

అట్టు బాగా వేగింది అతని మనసులాగే.

అప్పుడే అడుగుపెట్టాడు కొడుకు అప్పారావు.

అట్టును ఇంకోవైపు తిప్పిందావిడ.

"వచ్చావా నాయనా రా! ఇంకా నీ స్నేహితులెవరితోనయినా మాట్లాడాలంటే మాట్లాడు. ఇదుగో ఫోను!"

పెనం వేడెక్కి ఉందేమో అట్టు ఆవైపు ఇట్టే రెడీ అయింది.

అప్పారావు తండ్రి దగ్గర ఎక్కువ మాట్లాడడు. అదే తల్లి దగ్గర నానా మాటకాలు ఆడతాడు. మౌనంగా ఉండాలా, సమాధానం చెప్పాలా అర్థం కాక అలా బొమ్మలా నిలబడ్డాడు.

"ఏరా నంగనాచిలా నిలబడతావ్! ఫోనుల్లో కథలు చెప్పుకుంటున్నారా ఏమిటి? చేంతాడంత బిల్లు తెచ్చినప్పుడున్న మాటలు నాదగ్గర రావేం?" హూంకరించాడు. ఆ మాటలు వింటూ కాసేపు ఉంటే మాడిపోతానన్నట్లు అట్టు ఆమెను మాసింది.

వెంటనే దానిని తీసి ప్లేటులో వేసి మళ్లీ ఇంకో అట్టు వేసింది.

"నెలనెలా నేనిలా వాగటం, మీరు ఈ చెవితో విని, ఆ చెవితో వదిలెయ్యటం మీకిదేదో ఆటలా వుంది.

"లేదు నాన్నా! డౌట్స్ ఉంటే ఫోనులో డిస్కస్



చేసుకున్నాం. అంతే!"

"అహ! అంతేనా! ఫోనులోనే మీ లెక్చరర్‌ను పాఠాలు కూడా చెప్పమనకపోయావా?"

అటునుంచీ మౌనం.

పెనం ఖాళీ అవటంతో మరో అట్టు వెయ్యడానికి పిండి వేసి త్రిప్పుతోంది ఆవిడ.

"నేనీ ఫోను బిల్లులు కట్టలేనురా బాబూ! ఇంకొన్నాళ్లు ఇలాగే సాగితే ఇవి కట్టడానికి నాకున్న ఈ రెండు గదుల కొంప కుదువ పెట్టాల్సిందే!

అట్టు తీసి అట్టు వేసిందావిడ.

ఇక్కడ అప్పారావుకి తిట్లమీద తిట్లు.

ఇక తను వెళ్లి అడ్డుకోకపోతే ఇక అట్టు మాడినట్లు ముఖం మాడ్చుకుంటాడు. పొయ్యి స్విచ్ ఆఫ్ చేస్తూ భర్త నోటిని అదుపులో పెట్టటానికి ప్లేటులో అట్లుతో, మంచినీళ్లతో బయలుదేరింది ఆవిడ.

పెనానికి, పొయ్యికి భార్యాభర్తల సంబంధమే అయ్యుంటుంది.

తన ఆలోచనలకు నవ్వు రమ్మన్నా రావటం లేదు.

గుమ్మంలోంచి ఆమె రావటం చూసి "తొందరగా రా! కడుపు ఆకలితో రగిలిపోతోంది. ఈ కడుపు మండేదాకా ఊరుకోరుగా మీ ఇద్దరూ" అతను ప్లేటు మీద యుద్ధం ప్రారంభిస్తుంటే నెమ్మదిగా కొడుకుకు సైగ చేసింది లోపలికి వెళ్లిపొమ్మని.

ఒక అట్టు తిన్నాక పైకి తల ఎత్తి "వీడు నెమ్మదిగా జారుకున్నాడా?"

"అబ్బే! లేదు. కాళ్లు కడుక్కొని, డ్రస్సు మార్చుకొని మీదగ్గరే వచ్చి కూర్చుంటాడు."

"ఎందుకు బుద్ధావతారంలా బుద్ధిగా పోజు పెట్టడానికా? ఇదుగో శాంతం ఇదే నా చివరి వార్నింగ్! వచ్చేనెలకు బిల్లు తగ్గించకపోతే కనెక్షన్ తీయించి పారేస్తాను. ఇక నావల్ల కాదు..."

"అట్టు తినటమయితే నేను తినిపెడతానని చెప్పు" తల్లి వెనుక చేరి గొణిగాడు.

"నువ్వుండరా అసలే ఈ గండం ఇలా గట్టెక్కుతామా అని చూస్తుంటే" అన్నట్లు ఒక్క గిల్లు గిల్లింది.

"ఆ గదిలో ఉన్న బాంబు పేలినంత గట్టిగా అరిచి నాన్న పిలుస్తాడని నీ వెనుక నక్కాను."

నాలుగు అట్లు అయిపోయాయి.

ఆకలి తీరింది.

ఆవేశం చల్లారింది.

నెమ్మదిగా అతను వదిలిన ప్లేటుని, ఖాళీ గ్లాసుని తీసుకువెళ్లిపోయింది శాంతంగా శాంతమ్మ.

ఆమెను కొంగుచాటు కొడుకులా అనుసరించాడు.

మరి ఇంకోనెలదాకా ఈ ఫోన్ బిల్లు ప్రహసనానికి తెర వేసెయ్యటమే కదా అని ఊపిరి పీల్చుకున్నారిద్దరూ!

కనీసం ఆ ఫోనులో ముచ్చట్లు కూడా లేకపోతే ఈయన అరుపులు, కేకలకు ఎప్పుడో సన్యాసిగా మారటమో, వృద్ధాశ్రమం అడ్రస్సులు వెతుక్కుంటూ చేరిపోయేది కాదూ! బయటకు మాట్లాడకపోయినా మనసులో మాటలు కుప్పలు తెప్పలే శాంతం గారికి. ఏదోరకంగా ఫోన్ బిల్లు డబ్బులు తనే సంపాదించుకోవాలని దృఢనిశ్చయం తీసుకుంది మురిపుగా! తనను సంపాదనాపరురాలిని చేసిన ఫోన్‌ని మురిపెంగా చూస్తూ మురిసిపోయిందావిడ.

జీవితం అంటే ఎప్పుడు ఏ మలుపు తిరుగుతుందో ఎవరికీ తెలియదు.

**-యలమర్తి అనూరాధ** (విజయవాడ)